నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

# తెలంగాణ జిల్లాలు

బుధవారం 15, మే 2024 | పేజీలు: 04



## భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పాశ్చాత్య దేశాలు గౌరవిస్తున్నాయంటే





# మహిళల గొప్పతనమే..



- బంధాలు అనుబంధాలు, ఆప్యాయతలు అనురాగాలు నేటికీ కొనసాగుతున్నాయంటే స్త్రీల గొప్పతనమే..
- సమాజంలో తల్లిగా చెల్లిగా, సహధర్మచారిగా మహిళలదే కీలక పాత్ర
- ఆశీర్వాదాలలో అమ్మ ఆశీర్వాదాన్ని మించిన ఆశీర్వాదం లేదు..

తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్) -మే 14:

మాతృ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని స్థానిక రెడ్డి గార్డెన్‌లో ఉమెన్స్ ఎంపవర్మెంట్ తెలు గు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ నిర్వాహక అధ్యక్షులు ఇంచార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అధ్యక్షతన హ్యాపీ మదర్స్ డే వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథు లుగా ఎమ్మెల్యే యశస్విని రాజా రామ్మోహన్ రెడ్డి ఝాన్సీ రెడ్డి తల్లి సరస్వ తమ్మ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రెడ్డిలు సంయు క్తంగా మాట్లాడుతూ కట్టుబొట్టు సం స్కృతి సాంప్రదాయాలకు ప్రతి రూపం భారతీయ మహిళలేనని వారిని పాశ్చాత్య దేశాలు ఆదర్శంగా తీసుకుంటు న్నాయంటే అది నాటి నేటి మహిళల గొప్పతనమేనని అన్నారు. అంతేకాకుండా ఒక స్త్రీ తల్లిలా చెల్లిలా సహధర్మాచారిలా సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ కుటుంబ భారాన్ని మోస్తూ సర్వం మిగతా 2లో..

# వరంగల్ పార్లమెంట్ పీఠమెవరిదో?




## నేను గెలుస్తానంటే నేనే గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు..

వరంగల్, (నేటి ఫోకస్‌న్యూస్)-మే 14:

పార్లమెంటు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలలో వివిధ పార్టీల నాయకులు సోమవారం పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సందర్భంగా అక్కడికి ఓటు వేసేందుకు వచ్చిన జనాల ఆదరణ అభివాదాలను చూసి తబ్బిబ్బై నేనే గెలుస్తానంటే నేను గెలుస్తానంటూ ఎవరి ధీమాను వారు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ పార్ల మెంట్ అభ్యర్థి కడియం కావ్య ను గెలిపించుకునేందుకు పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి,ఇంచార్జి హనుమాడ్ల ఝాన్సీ రెడ్డిలు మండు టెండను సైతం లెక్కచేయకుండా జిల్లా వ్యాప్తంగా విస్తృత పర్యటన ప్రచారాలు నిర్వహించి యుద్ధ ప్రాతి పదికన శతవిధాల ప్రయత్నం మిగతా 2లో..

## భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పాశ్చాత్య దేశాలు గౌరవిస్తున్నాయంటే

# మహిళల గొప్పతనమే..






(మొదటిపేజీ తరువాయి..)

త్యాగం చేస్తూ సమాజంలో కీలకమైన పాత్ర పోషిస్తుందని వారు అన్నారు. నాటికి నేటికి బంధాలు అనుబంధాలు, ఆప్యాయతలు అనురాగాలు కొనసాగుతున్న అంటే అది మహిళల గొప్పతనమేనని అన్నారు. సకల చరా చర సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని, మంచి మనసున్న మాతృమూర్తి అమ్మేనని అమ్మ ఆశీర్వాదాన్ని మించిన ఆశీర్వాదం లేదని అన్నారు. అమ్మ ఆశీర్వాదంలో ఎన్నో శక్తులు దాగున్నాయని. వారి ఆశీర్వాదాలు స్వీకరించిన దేవతల నుండి మానవుల వరకు ఎన్నో కీర్తి ప్రతిష్టలు పొందారని వేదాలు పురాణాలు ఈ నగ్న సత్యాన్ని ఘోషిస్తున్నాయని అన్నారు. అందుకే మహిళలను గౌరవిద్దాం, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి మన సంస్కృతి సాంప్రదాయాలు కనుమరుగు చేయవద్దని, మనల్ని కనిపెంచిన మాతృమూర్తులను కంటికి రెప్పల కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. హ్యాపీ మదర్స్ డే అంటే ఒకరోజు జరుపుకొని చేతులు దులుపుకోవడం కాదని మాతృమూర్తుల జీవిత పర్యంతం వృద్ధాశ్రమాలకు పంపకుండా మన వద్దనే ఉంచుకొని వారిని కష్టపెట్టకుండా సపర్యలు చేసినప్పుడే హ్యాపీ మదర్స్ డే కు నిజమైన స్వార్ధకత చేకూరుతుందన్నారు. 17వ శతాబ్దంలో గ్రీస్ లో ప్రియా అనే దేవతను మదర్ ఆఫ్ గాడ్స్ గా భావించి ఏడాదికి ఒకసారి నివాళులర్పించడంతో మాతృమూర్తులకు గౌరవంగా మదరింగ్ సండే పేరిట ఉత్సవాలు జరిపే వారని గుర్తు చేశారు. అంతేకాకుండా 1872 లో జూనియర్ వర్డ్ హోవే అనే మహిళ అమెరికాలో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్ డే నిర్వహించాలని ప్రతిపాదించారని తెలిపారు. అదేవిధంగా అన్నా మేరీ జార్విస్ అనే మహిళ మదర్స్ ఫ్రెండ్షిప్ డే జరిపేందుకు ఎంతో కృషి చేసిందని హ్యాపీ మదర్స్ డే ప్రాముఖ్యత గురించి తెలిపారు.. అనంతరం పాలకుర్తి నియోజకవర్గం చెందిన వివిధ మండలాల మహిళలు తమ మాతృమూర్తులను తీసుకుని వచ్చి ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రెడ్డిల చేతుల మీదుగా సన్మానం పొందారు. మాతృ దినోత్సవ వేడుకల సందర్భంగా మిమ్మల్ని అందరిని వేదికపై కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిలు హాజరైన మహిళలకు హ్యాపీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.అందుకు అభివాదంగా

ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలు కూడా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిలకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హనుమాండ్ల తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషన్ డైరెక్టర్ లింగాల వెంకట్ నారాయణ గౌడ్, జాటోత్ నెహ్రూ, మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, గుండాల నర్సయ్య,





నర్మెట గజానంద్, తొర్రూర్ మండల వైస్ ఎంపీపీ ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి, జిలకర సురేందర్, జలగం వెంకన్న, కాందాడి అచ్చిరెడ్డి, కొడకండ్ల మండల ఇంచార్జి గంజి ప్రసాద్ రెడ్డి, విజయ పాల్ రెడ్డి, పూసల ఉమా, పంజాల ఉపేందర్ నియోజకవర్గ మహిళలు అమ్మలు, అమ్మమ్మలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పార్లమెంట్ పీఠం పీఠమెవరిదో?

(మొదటిపేజీ తరువాయి..)

చేశారు. కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసే తమదైన శైలిలో కడియం కావ్య కు పట్టం కట్టేందుకు పావులు కదుపుతూ అత్తా కోడళ్ళు అపర చాణిక్యులై విజయ గీతికలను మ్రోగించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ ల హామీలలో మహాలక్ష్మి, గృహ జ్యోతి, వంటి అద్భుతమైన పథకాలను అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అమలుచేసి ప్రజల మెప్పును పొందడంలో విజయం సాధించింది. మిగిలి ఉన్న పథకాలను అమలు చేయకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ లోకల్ బాడీ ఎలక్షన్స్ అయిపోయేంత వరకు ఆగస్టు నెల వరకు వాయిదా వేయడంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న ఆదరణ సన్నగిల్లుతున్నట్టు అక్కడక్కడ వినిపిస్తున్న చర్చ నీఅంశం చెక్కర్లు కొడుతున్న సమాచారం. అంతేకాకుండా కడియం కావ్య బిఆర్ఎస్ పార్టీ నుండి పార్లమెంట్ టికెట్ పొంది ఆ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆమె సొంత నియోజకవర్గంలోని తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు, ఆమె ముస్లింను ప్రేమ వివాహం చేసుకున్న వివాహ అంశం వివాద అంశంగా మారడంతో ఆమె దళితురాలు ఎట్లా అవుతుందని అదే సామాజిక వర్గానికి చెందిన మందకృష్ణ మాదిగ, మోత్కుపల్లి నరసింహులు వంటి దళిత నేతలు దళిత సంఘాలు ఆమె ససేమిరా గెలవ వద్దనే సంకేతాన్ని దళిత వర్గాల ప్రజలకు చేరవేసేందుకు ఆరోపణస్త్రాలు సంధించారు. మరోవైపు బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆరు గ్యారంటీలలో అమలు చేయని సంక్షేమ పథకాల తీరును కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడిన.. వీడియోలను వాట్సప్ ఫేస్బుక్ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ తమకనుకూలంగా మలుచుకునే పనిలో బిజీ బిజీగా అడుగులు వేయడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న కాస్త ఆదరణ లేకుండా పోయిందని అక్కడక్కడ ప్రజల నుండి వినిపిస్తున్న సమాచారం. అంతేకాకుండా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేము చేపట్టిన సంక్షేమ పథకాలు కెసిఆర్ కిట్, రైతు బంధు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, వృద్ధాప్య పింఛన్లు, హరితహారం పల్లె వెలుగు, కంటి వెలుగు పథకాలు ప్రజలలో బిఆర్ఎస్ పార్టీ పై ఉన్న సుస్థిర స్థానం చెక్కుచెదరలేదనే ధీమాను ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ ఆర్ గ్యారంటీలపై పూటకో మాట, పేటకో పాట అన్నట్లుగా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ మాట మారుస్తుండడంతో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించి తులం బంగారానికి, 4000 రూపాయల పెన్షన్ 4000 రూపాయల నిరుద్యోగ భృతి, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, చదువుకునే విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు 2500 భృతి, 500 రూపాయలకే గ్యాస్ వంటి వాటికి ఆశపడి గెలిపించి మోసపోయి తప్పు చేశామా అని, ఆ తప్పును సరిదిద్దుకునేందుకు బి ఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ను గెలిపించుకునేందుకు తండోప తండాలుగా తరలివస్తున్నారని ఆనందంతో గెలుస్తామనే ధీమాతో బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం గంటపదంగా చెబుతున్నారు. మరోవైపు వరంగల్ బిజెపి పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ను గెలిపించుకునేందుకు గత నెల రోజులుగా బిజెపి శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేశాయి. అంతేకాకుండా బిజెపి ప్రభుత్వం ఈడి సంస్థలను అధీనంలో ఉంచుకొని వివిధ పార్టీల నాయకులపై ఉసిగొల్పుతూ ఊహకందని రీతిలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసింది. కాజీపేటకు దక్కాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తమిళనాడులోని శ్రీ పేరంబుదూరుకు మార్చిన వైనం,జన్ ధన్ ఖాతాలలో 15వేల రూపాయలు, వేస్తామని వేయని తీరును, పెట్రోల్ డీజిల్ గ్యాస్, నిత్యవసర సరుకులు ధరల పెంపు అభ్యర్థి భూ వివాదాలు, భూ కబ్జాలు వంటి వైఫల్యాలు బిజెపి అభ్యర్థిని గెలవనీయకుండా అవరోధాలుగా మారుతునాయంటూ వినిపిస్తున్న ప్రచార పర్వం వాడి వేడిగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ నేపథ్యంలో ఆరూరి రమేష్ గెలవడం కష్టసాధ్యమే నన్న చర్చలు కూడా ప్రజల మధ్య లేకపోలేదు.. మరోవైపు తొర్రూర్ పట్టణానికి చెందిన పంజా కల్పన గతంలో బిఆర్ఎస్ పార్టీలో ఉండి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ గా నిరుద్యోగ యువతకు శిక్షణను ఇప్పించి వారికి వివిధ కంపెనీలలో బంగారు భవిష్యత్తును చేకూర్చానని, మహిళలు స్వశక్తిపై జీవించాలనే ఆశయంతో వారికి కుట్టు మిషన్ శిక్షణ శిబిరాలు నిర్వహించి వారి జీవితానికి భరోసా కల్పించా నంటూ ప్రజల మెప్పును పొందడంలో విజయం సాధించగలిగానంటూ పంజా కల్పన ధీమా వ్యక్తం చేశారు. ఏదేమైనా టిఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు నమ్మి ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని అంకితభావంతో పార్టీ కొరకు పనిచేస్తే చివరి నిమిషంలో మోసానికి గురి కావడంతో బిఎస్పీ పార్టీలో చేరానని సేవా దృక్పథం ఉన్న నాయకురాలిగా బిఎస్పీ పార్టీ గుర్తించి వరంగల్ పార్లమెంటు బిఎస్పి అభ్యర్థిగా టికెట్ ఇవ్వడంతో మీ ముందుకు వచ్చానని ఆదరించి ఆశీర్వదించి గెలిపించాలంటూ గత ఆరు నెలల నుండి జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాలలో వివిధ పార్టీల నాయకుల పై ఉన్న వ్యతిరేకతను,వైఫల్యాలను ఎండగడుతూ తమకనుకూలంగా మార్చుకునేందుకు మండుటెండలో సైతం లెక్క చేయక ప్రచార హోరును విస్తృతం చేయడంతో అక్కడ లభిస్తున్న ప్రజల ఆదరణను చూస్తుంటే ఎలాగైనా గెలిచి తీరుతాననే ధీమాలో పంజా కల్పన ఉన్నట్లు సమాచారం. వివిధ పార్టీల నాయకుల తీరును చూస్తుంటే. వారి వైఖరిని వింటుంటే, ఎవరిని గెలిపించాలా...! ఎవరిని గెలిపిస్తే మనకు న్యాయం జరుగుతుంది అనే ఆలోచనలో కొట్టుమిట్టాడుతున్నారు ప్రజలు. ఈ నేపథ్యంలో ప్రజలెవరిని గెలిపిస్తారనే అంశం అంతుచిక్కని ప్రశ్న గానే మిగిలింది. ఏది ఏమైనా పార్లమెంట్ పీఠం ఎవరికి దక్కుతుందో.. ప్రజలెవరిని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.. ఎవరెన్నికైన ఆల్ ది బెస్ట్ చెప్పాల్సిందే

- నాల్లం శ్రీనివాస్ (కవి)
మహానగరంలో న్యూస్ రిపోర్టర్
తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా.





# సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలో
# బీఆర్ఎస్ కౌన్సిలర్‌పై దాడి

- ఇంట్లోకి చొరబడి విచక్షణ రహితంగా కర్రలతో చితకబాదిన కాంగ్రెస్ నేతలు
- అధికార అహంతోనే ఈ దాడులు
- దాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ
- దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి..

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి చారకొండ వెంకటేష్ (నేటి ఫోకస్ న్యూస్) మే 15:**

సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో అచ్చంపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుంకరి నిర్మల బాలరాజు కౌన్సిలర్ పై కాంగ్రెస్ నేతలు దాడి చేయడంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, అచ్చంపేట మున్సిపల్ చైర్పర్సన్ గౌడ్ ఎడ్ల నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో అచ్చం పేట పట్టణంలోని సాయిరాం థియేటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వీధి రౌడీల్లా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ పై విచక్షణ రహితంగా దాడులు చేయడం సిగ్గుచేటుగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దాడికి పాల్పడిన దుండగులను చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు వీధి రౌడీల... గుండాల... వివరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికార అహంతో విర్రవీగిపో తున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి తీరుతారని ఈ సందర్భంగా తెలిపారు.

**ఇరువురిపై కేసు నమోదు: ఎస్సై రాము**

అచ్చంపేట ఎస్సై రాములు నీటి ఫోకస్ న్యూస్ దాడి పై వివరణ కోరగా.. సుంకరి బాలకృష్ణ, లాలయ్య కాంగ్రెస్ పార్టీకి చెందిన వారన్నరు. ఇది వ్యక్తిగత గొడవలతో జరిగిందని కావాలనే ఇరువర్గాలు పార్టీలను అడ్డం పెట్టుకొని రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత కారణాలవల్ల గొడవలు జరుగుతే మా దృష్టికి తీసుకురావాలి కానీ పార్టీల పరంగా రెచ్చగొట్టే పనులు చేయవద్దని ఆయన తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ నేతలు కావాలనే ర్యాలీ ధర్నా చేయడంపై ఇరువు వర్గాల వారిపై కేసు పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదర్శ దంపతులకు ఆత్మీయ సత్కారం

**మిర్యాలగూడ (నేటి ఫోకస్ న్యూస్) మే 14:**

50వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు దంపతులు మిర్యాలగూడ మాజీ శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ ఛైర్మన్ శ్రీ. తిప్పన విజయసింహారెడ్డి - అనంతలక్ష్మీ దంపతుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు వైదేహి టౌన్షిప్ లో గల వారి నివాసం నందు మాజీ శాసన సభ్యులు నల్లమోతు భాస్కర్ రావు - జయ దంపతులు విజయసింహారెడ్డి - అనంతలక్ష్మీ దంపతులను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి, మిఠాయి తినిపించి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం వైదేహి టౌన్షిప్ లో గల కమ్యూనిటీ భవనం నందు బి.ఆర్.ఎస్ నాయకులు, విజయసింహారెడ్డి - అనంతలక్ష్మీ దంపతులను భారీ గజమాల తో సత్కరించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసారు.







## కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు
# వనపర్తి యువకుడు

- ఎడిటింగ్ విభాగంలో రాఘవేందర్‌కు ఆహ్వానం
- తాను ఎడిటింగ్ చేసిన ఇన్ రిట్రీట్ అనే చిత్రం ప్రదర్శనకు ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న వనపర్తి వాసులు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



ప్రపంచ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో పాల్గొనడానికి వనపర్తికి చెందిన రాఘవేందర్ ఆహ్వానం అందుకున్నారు. రాఘవేందర్ ఎడిటింగ్ చేసిన ఇన్ రిట్రీట్ అనే గంట15 నిమిషాల నిడివి గల భారతదేశంలోని లడక్ ప్రాంతీయ భాష లో తీసిన ఈ చిత్రం కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శించడానికి ఎన్నికయింది. ఈ సందర్భంగా రాఘవేందర్ ను ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఫిలిం ఫెస్టివల్‌కు హాజరు కావాల్సిందిగా నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది. 30 సంవత్సరాల క్రితం ఊరు వదిలి వెళ్ళిన ఒక వ్యక్తి తిరిగి తన సొంత ప్రాంతానికి వచ్చి పొందిన మానసిక ఉద్వేగాల సమాహారమే ఇన్ రిట్రీట్ సినిమా కథాంశం. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఉప్పుగంటి యాదగిరి భారతి ల కుమారుడు ఉప్పుగంటి రాఘవేందర్ వనపర్తిలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న అనంతరం 2012 నుంచి 2018 వరకు పూణేలోని ఫిల్మ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో ఫిల్మ్ ఎడిటింగ్ విభాగంలో పీజీ డిప్లమా పూర్తి చేశాడు. ప్రేక్షకులను విశేషంగా అలరించి అవార్డులు సాధించిన మల్లేశం... హౌ ఇస్ దట్ ఫార్ మండే అనే రెండు చిత్రాలకు రాఘవేంద్ర ఎడిటింగ్ చేయడం విశేషం. మొదటి రెండు చిత్రాలకు చిత్ర పరిశ్రమకు చెందిన మేధావులతో ప్రశంసలు అందుకున్న రాఘవేందర్ తాను ఎడిటింగ్ చేసిన మూడవ చిత్రం ఇన్ రీ ట్రీట్ ఏకంగా ఫ్రాన్స్ లో జరుగుతున్న అంతర్జాతీయ కెన్ ఫిలిం ఫెస్టివల్ కు ఎంపిక కావడం గొప్ప విశేషంగా చెప్పుకోవచ్చు. రాఘవేందర్ తో పాటు పూణేలో దర్శకత్వ విభాగంలో శిక్షణ పొందిన మైసమ్ ఆలీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రాఘవేందర్ తాత నారాయణ వనపర్తి ప్రాంతంలో గొప్ప ఆర్టిస్టుగా మొట్టమొదటి ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందారు. రాఘవేంద్ర సైతం ఈ రంగాన్ని ఎంచుకోవడానికి ఒక కారణమని గర్వంగా చెప్తున్నాడు. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన రాఘవేంద్ర చిన్న వయసులోనే ఎడిటింగ్ విభాగంలో అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం, అతను ఎడిటింగ్ చేసిన చిత్రం కేన్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శించ బడుతుండడం పట్ల ఈ ప్రాంతానికి చెందిన మేధావులు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునుముందు అతను మరింత పెద్ద స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నారు.

## నాగ్సన్‌పల్లిలో ఘనంగా రేణుక ఎల్లమ్మ
# మొదటి వార్షికోత్సవం

**ఉమ్మడి మెదక్ జిల్లా నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి భామిని రఘుపతి:**

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సన్ పల్లి గ్రామములో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ మాత మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారము అంగరంగ వైభ వంగా ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుండి అమ్మ వారికి పంచామృతాలతో అభిషేకము నిర్వహించి పట్టు వస్త్రాలతో పూల మాలలతో అమ్మవారిని అలంకరించి దర్శించుకుని తీర్థప్రసాదాలు అందించారు. చుట్టుప్రక్కల ఉన్నటువంటి గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గౌడ సంఘ నేతలు మాట్లాడుతూ సాయంత్రము.6 గంటలకు రేణుక ఎల్లమ్మకు ఘనంగా బోనాల ఊరేగింపు కార్యక్రమము ఉంటుందని భక్తులందరూ పాల్గొనాలని తెలిపారు.



నేటి ఫోకస్ న్యూస్
బుధవారం 15, మే 2024

# మెజారిటీ తగ్గితే మేఘారెడ్డిని తగ్గించలేరు

- బిఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నమ్మించి నట్టేట ముంచారు
- కడుపులో కత్తెరలు.. నోట్లో చక్కెర్లు అన్న చందంగా కాంగ్రెస్‌లోని ఓవర్గం ప్రచారం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఫామ్‌లు ఇచ్చేది నేనే గెలిపించేది తానే
- చుట్టూ ఉండే భజన బ్యాచ్‌ల మాటలు నమ్మను
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఘాటు వ్యాఖ్యలు



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి.శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి):**

నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వనపర్తి సెగ్మెంట్ లో మెజారిటీ తగ్గితే తనను తగ్గించలేరని స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. వనపర్తి లో బిజెపితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్న బిఆర్ఎస్ పెద్దలు బిజెపికి అనుకూలంగా పనిచేసే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను నమ్మించి నట్టేట ముంచారని ఆరోపించారు. పోలింగ్ బూతుల వద్ద ఏజెంట్లు, ప్రచారం చేసేందుకు నాయకులు సైతం ఉదయం 9:30 గంటలలోపే ఫలాయనం చిత్తగించారని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బి ఫామ్ ఇచ్చేది, గెలిపించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. నవంబర్ 30 లోపు కాంగ్రెస్ పార్టీ కోసం, తన గెలుపు కోసం పనిచేసిన నాయకులకు కచ్చితంగా పదవులు వస్తాయని తన చుట్టూ ఉండే భజన బ్యాచుల మాటలు కానీ తన బంధువుల మాటలు కూడా నమ్మనని స్థానిక నాయకులు, ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందని కుండబద్దలు కొట్టారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో వనపర్తి సెగ్మెంట్ లో 50 నుంచి 60 వేల మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వనపర్తిలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తగ్గించి తన పాపులారిటీ తగ్గించేందుకు ఒకటి రెండు బ్యాచులు అదే రోజు రాత్రి వరకు విశ్వ ప్రయత్నాలు చేసిందని అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని వాటిని బయటపెట్టి తన స్థాయిని తగ్గించుకోలేనన్నారు. జర్నలిస్టు మిత్రులు అంటే తనకు ఎంతో గౌరవం అని వారి ఇంటి స్థలాలకు సంబంధించిన పంపిణీలో గత మాజీ మంత్రి రికార్డులు లేకుండానే తహసిల్దార్ పై ఒత్తిడి తెచ్చి ఉత్తుత్తి ప్రోసిడింగులు ఇచ్చి అందరిని గందరగోళానికి గురి చేశారని ఆరోపించారు. ఇంటి స్థలాలపై తాను ప్రత్యేక శ్రద్ధ వహించి చుట్టూ ప్రహరీ నిర్మించి న్యాయబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయచందర్, మునిసిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పెబ్బేరు కు చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, రహీం, లక్కాకుల సతీష్ కుమార్, సత్యశీలా రెడ్డి, సాయి చరణ్ రెడ్డి, ఉమ్మళ్ళ రాములు పాల్గొన్నారు.




# వైద్య విద్యలో రాణించి ప్రజలకు ఉచిత వైద్యసేవలందిస్తా: కె.శిరీష

## విద్యార్థినిని సన్మానించిన కళాశాల యాజమాన్యం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

భవిష్యత్తులో వైద్య విద్యలో రాణించి ప్రజలకు ఉచిత వైద్య సేవలందిస్తానని కే.శిరీష అనే విద్యార్థిని ఆశాభావం వ్యక్తం చేసింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరలో కే.శిరీష అనే విద్యార్థిని 461 మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానం సంపాదించింది. వనపర్తి మండలం ఖాసీంనగర్ గ్రామంలోని కందిరీగ తండాకు చెందిన కే. శిరీష పేద గిరిజన కుటుంబంలో జన్మించింది. పట్టుదల, లక్ష్యంతో చదువుకొని కళాశాలలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏ. ప్రభు లింగం, కరస్పాండెంట్ ఎండి. చాంద్ పాషా, యాజమాన్య సభ్యులు రామ్ రెడ్డిలు విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డురాదని కృషి, పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా రాణించవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఎంచుకున్న రంగంలో విజయం సాధించి అందరికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించేందుకు సహకరిం చిన కళాశాల యాజమాన్యం సభ్యులకు విద్యార్థిని శిరీష ధన్యవాదాలు తెలిపింది.

## జిల్లా కేంద్రంలో ఈవిఎమ్ మిషిన్లను

# భద్రపరిచిన అధికారులు

- జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్ష్, రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-చారకొండ వెంకటేష్ మే 15:**



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఈవీఎం లను భద్రపరిచి స్ట్రాంగ్ రూములకు నియోజకవర్గ అభ్యర్థుల సమక్షంలో సీల్ చేయడం జరిగింది. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ లు దగ్గరుండి మిషన్ల భద్రత విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దొంగలున్నారు జాగ్రత్త

# రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



వేసవి కాలములో ఎండ వేడిమి తీవ్రతకు ప్రజలు రాత్రిపూట ఇండ్ల ముందు నిద్రిస్తుండడంతో దొంగలు స్వైర విహారం చేస్తున్నారని రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి అన్నారు. దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు జిల్లా ఎస్పీ రక్షిత మూర్తి ఆదేశాల మేరకు ఆటోకు దొంగలున్నారు జాగ్రత్త అనే నినాదంతో బ్యానర్ తగిలించి మైకు ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాయ కష్టం చేసి సంపాదించిన డబ్బులు, ఆభరణాలు ఇంట్లో పెట్టుకోకుండా బ్యాంకుల్లో దాచుకోవాలని సూచించారు.